

# నిప్పుతో చెలగాటం

రచన: ఎస్. సి. రాజా

నేనూ, శంకర్రావుగారూ మనుష్యులు కాస్త లేకుండా నిర్జనంగా ఉండే చోటుకి షికారు కని బయలుదేరాం.

శంకర్రావుగారికి నలభై అయిదేళ్లు వెళ్లాయి. అయినా మంచి దారుఢ్యమైన శరీరం ఆయనది. ఆయన నడుస్తూంటే యువకులమైన మేము వెనకాల పరిగెట్ట వలసి వస్తూండేది. మా అందరితోనూ ఆయన కలిసి మెలిసి తిరుగుతూండేవారు. నేనంటే ఆయనకి ప్రత్యేకమైన అభిమానం కూడాను.

సరే - యింతకీ ఆ రోజు మేం వెడుతుండగా మా కెదురుగా యిద్దరమ్మాయిలు కనిపించారు. చక్కని చుక్కల్లా అలంకరించుకుని సీతాకోకచిలకల్లాగ కనిపించారు వాళ్లిద్దరూ. అందులో ఒక అమ్మాయి శంకర్రావుగారిని ఒక మాదిరిగా చూసి, చిరునవ్వు నవ్వింది. వాళ్లు మమ్మల్ని దాటారు. నేను వెనక్కి తిరిగి చూశాను. ఆ అమ్మాయి యింకా ఆయన వైపు చిరునవ్వు విసురుతూనే ఉంది. నేనాశ్చర్యపోయాను. యువకుణ్ణి నన్ను చూడకుండా, ఆ ముసిలాయనని చూడ్డానికి ఆయనలో ఏం ఆకర్షణ ఉందా అనిపించిందినాకు.

“ఏమండోయ్! మీ జుట్టు నెరుస్తున్నా మిమ్మల్నింతా అమ్మాయిలు ఎగాదిగా చూస్తున్నారండోయ్!” అన్నాను వేళాకోళంగా.

“అబ్బే! స్త్రీహృదయంలో ఏంజరుగుతున్నదీ మనం చస్తే కనుక్కోలేం. వింతగా చూస్తోందో, వేళాకోళంగా చూస్తోందో, గౌరవంగా చూస్తోందో, ప్రేమగా చూస్తోందో, కనుక్కోడం బ్రహ్మతరంగాదు” అన్నారాయన.

“అది ప్రేమే! తెలియటంలేదూ? ఇంకో రెండుసార్లు కలుసుకుంటే ప్రేమ వృక్షం పెరక్కపోతుందా?” అన్నా నేను.

శంకర్రావుగారు మట్టుకు సీరియస్‌గా, “ఇదే మీకున్న అనుభవలోపం అంటాను. ఆడది ఒక్క చిరునవ్వు నవ్వితే మగాడు,

అంటే నీబోటి యువకుడు, కరిగిపోయి, అదంతా తన ప్రయోజకత్వమే అన్నట్టుగా కలలు కంటాడు. యిదంతా నాకు నీ వయస్సప్పుడే బాగా అనుభవం—"

నేను తిరుగు ప్రశ్న వెయ్యకుండా చెవులు నిక్కించి వింటున్నాను. ఆయన చెప్పుకుపోతున్నారు.

"-అలాగని నేను స్త్రీలని ద్వేషిస్తున్నా ననుకోవద్దు. స్త్రీలంతా ఆట బొమ్మలలాగ మగాళ్లతో ఆడుకుంటారు. అది వాళ్లకి సరదా. వాళ్లని కవ్వించి, మెప్పించి, చేర బోయే సమయంలో వెళ్ల గొడతారు. అది వాళ్లకి ఒక ఆట !

"యింతకీ రెండు హృదయాలూ ఒకే తీగకి కంపించడం చాలా అరుదుగా చూస్తూంటాం. యింతవరకూ నా అభి ప్రాయాలతో మనస్ఫూర్తిగా ఏకీభవించి, నేను నవ్వినప్పుడు నవ్వి, ఏడ్చినప్పుడు ఏడ్చేవాళ్లని నేనింతవరకూ ఎన్నుకోలేక పోయాను.

"నీవయస్సులో నేను చాలా అందంగా ఉండేవాణ్ణి. అప్పటికి నేను జీవితంలో ఒక భాగమైన వెలుగునే చూశాను. మా యింటి కెదురుగా పెళ్లయిన ఆవిడ వకర్తి ఉండేది. నేను హాల్లో కూర్చుని ఫిడేలు వాయించినపుడల్లా ఆమె కిటికీ దగ్గిరగా వచ్చి అతి శ్రద్ధగా వినేది. రోజూ నేనాఫీసునించి వచ్చి, ఎప్పుడు వయొలిన్ వాయిస్తానాఅన్నట్టుగా కాచుకు కూర్చునేదని నేను గమనించాను. కాని ఆమెకి సంగీతంలోనే యిష్టమో, ఆ వేళ్ల కదలికలోనే యిష్టమో నేను చాలాకాలం దాకా ఊహించలేకపోయాను. ఇలాగ చాలాకాలం గడిచింది.

"ఒక రోజున వాళ్ల యింటినించి నాకు భోజనానికి ఆహ్వానం వచ్చింది. ఆవిడ మొగుడు యింతకాలంనించీ ఒకరి జోక్యం కలిగించుకునే మనిషిలాగ కని పించకపోడం చేత ఈ అకస్మాత్తు ఆహ్వానం నాకాశ్చర్యం గలిగించింది. అయితే ఈ ఆహ్వానానికి వెనక ఏదో కథ ఉండి తీరాలి. ఒకవేళ వాళ్లింట్లో ఎవరన్నా పెళ్లీడు పిల్ల, ఉండి, దానికోసమే ఈ ఏర్పాట్లన్నీ చేశారేమోననిపించింది. కాని యింతకాలంగా చూస్తున్నవాణ్ణి గాబట్టి అలాంటిదేమీ కనిపించలేదు.

"సరె, వేళకి సరిగ్గా నాకే తెలియ కుండా నీటుగా ముస్తాబై వాళ్ల యింట్లో హాజరయ్యాను. నాకు ఎడమ వైపున 'ఆవిడా,' ఎదురుగా 'ఆయనా' కూర్చున్నారు. సందర్భాను సారంగా ఆమె పేరు సుభద్ర అనీ ఆయన పేరు సోమ సుందరంగారనీ తేలింది. ఆయన వ్యాపారస్థుడు. తన వ్యాపారాన్ని గురించి ఏమేమో చెప్పుకుపోతున్నాడు. నాకు చివరికి విసుగెత్తింది. హఠాత్తుగా ఎడమ వైపుకి తిరిగి చూసే సరికి సుభద్ర నన్ను ఎంతో తీక్ష్ణంగా చూస్తూండడం గమనిం చాను. ఆ చూపుల ధాటీకి నేనే తలవంచు కోవాల్సి వచ్చింది.

"భోజనానికి కూర్చున్నాం. అతి శ్రద్ధగా వడ్డించింది. ఆయన సొద

తప్పించుకోడానికి నేను సంగీతం గురించి మాట్లాడడం మొదలెట్టాను. యింతవరకూ మితంగా మాట్లాడుతున్న సుభద్రకి చాలా ఉద్రేకం వచ్చింది. ఆ పరవశత్వంలో ధాటీగా మాట్లాడింది. భోజనాలయ్యాక సోఫాల్లో కూర్చున్నాం. ఆ గదిలో సోమ సుందరంగారు వున్నసంగతి కూడా మరిచి పోయి, సంగీతం గురించి ఏమేమో మాట్లాడాం. ఎదురుగుండా సోఫాలో సోమ సుందరంగారు గుర్రుపెట్టి నిద్రపోతున్నారు. సుభద్ర ఆయనకేసి చిన్నపిల్లాణ్ణి చూసి నట్టు చూసి, నావంక స్వేచ్ఛగా చిరు నవ్వు నవ్వింది. విసుగూ, విరామం లేకుండా అలా మాట్లాడుకున్నాం.

"కొంతసేపటికి నేనొక గ్లాసుడు మంచినీళ్లిమ్మని ఆమె నడిగాను. నీళ్లిచ్చి, ఆమె నా దగ్గిరగా కూర్చుంది. ఆమె చేతులు నా చేతులకి తగిలాయి మాటల సందడిలో ఆమె తన చేత్తో నా చేతిని నొక్కింది. నేనిదంతా కావాలనే చేస్తోందా అనే విషయాన్ని దృఢపర్చుకోడంకోసం మళ్లా నా చేత్తో ఆమె చేతిని నొక్కాను. ఆమె చేతిని లాక్కోటానికి ప్రయత్నించ లేదు. ఆమెకిది చాలా యిష్టమనే సంగతి ఆమె విడిచిన నిట్టూర్పువలన తెలుసు కున్నాను. కొంతసేపటికి నేనామె దగ్గిర శలవు తీసుకుని బయటికి వచ్చాను.

"నాలో అనేక అనుమానాలు రేకెత్తాయి. ఈమె నన్ను కోరుతోందా ? లేక యిదంతా నా ఊహలు మాత్రమేనా? నన్నామె తన విశాలమైన కళ్లతో మింగే శేట్లాగ ఎందుకు చూస్తోంది? నాప్రక్కన కూర్చున్నప్పుడు ఆమె అంతసంతోషంగా కనిపించడానికి కారణం ఏమిటి ? ఆమె చేతిని నొక్కినప్పుడు ఆ చేతిని వెనక్కి లాక్కోడానికి ప్రయత్నించలేదేమి ? — ఆమె నామనస్థిమితం భగ్నం చేసింది. నిశ్చలమైన నీటిలో రాయివేసి అలలు కల్పించింది

"ఆమె చూపుల్లో ఎంత ఆకర్షణ ! కోలమొహం, అందులోంచి నల్లగా మెరుస్తూ నావంకే చూస్తున్న కళ్లూ, కొంటెగా వంకర తిరిగిన పెదిమెలూ, సున్నితమైన చేతుల చివరగా నాజూగ్గా, పొడుగ్గా ఉన్న వేళ్లూ, వాలుజడా, జార్జెట్ చీరలో వొంపుల శరీరం — ఆమె నాకళ్ల ముందు కనిపించింది .... యింతకీ ఆమె నాకంటే అయిదేళ్లు పెద్దది. ఆమె బుర్రలో ఏయే ఆలోచనలు, ఏయే భావా లున్నాయో !

"మళ్లా ఎన్నోరోజులవనేలేదు. సోమ సుందరంగారు నాకోసం కబురంపారు. మళ్లా భోజనానికి ! ఆయన ధోరణి నాకు బోధపడలేదు. నేను ముందర ఒప్పు కోలేదు. ఆయన నన్ను కాస్త పొగడి, వస్తేగాని వీల్లేదని పట్టు పట్టారు. ఏమైతే నేం, ఒప్పుకోక తప్పిందిగాదు. వచ్చే టప్పుడు ఫిడేలు కూడా తీసుకు రమ్మని మరీమరీ చెప్పారు.

"ఆరోజు భోజనాలయ్యాయి. సుభద్ర నా వేపు తన భావాలర్థం చేసుకో మన్నట్టుగా చూసింది. ఎక్కడకెళ్లినా

అక్కడ వెంటబడుతోంది. నాకీసారి కొద్దిగా ధైర్యం వచ్చింది ఆమె ధోరణితో.

"సోమ సుందరంగారు ఫి డే లు వాయించమనడం చేత నేను ఫిడేలు పుచ్చుకుని కూ ర్చు న్నా ను. సుభ ద్ర ఆ త్రంగా వింటోంది. ఆనంద భైరవి రాగం వాయిస్తూంటే, సంగీతం అంత యిష్టమైన సోమసుందరంగారు నిద్ర నాశ్రయించారు. త ర వా త సుభ ద్ర ఏదయినా విచారంగా ఉండే రాగం వాయించమంది. దాంతో 'ఏమో తెలియదు' అనే ముఖారి రాగం పదం వాయించాను. ప్రియుడికోసం విరహవేదనపడుతున్న ప్రియురాలి ఆక్రోశమది. పాట పూర్తి చేసి, నేనామె వంక చూసి నిశ్చేష్టుణ్ణయాను. ఆమె ఎర్రనిబుగ్గల వెంట రెండ శ్రుధారలు కారుతున్నాయి. కొంత సేపటికి ఆమె తేరుకుంది తనస్వప్న ప్రపంచం లోంచి.

"చాలా అద్భుతంగా ఉంది. కాని అలాంటి పాట లింకవద్దు. నాకీసారి నిజంగా పిచ్చెత్తుతుందేమో కూడా!" అంది.

"నాకు చాలా ఆశ్చర్యం వేసింది. యింతలో సోమసుందరంగారు నిద్ర నించి మేల్కొని, "గొప్ప పాటలెండి. చాలా ఆ న ం ద మై ం ది అది విని." అన్నారు. నేను శలవు తీసుకోడానికి లేచాను. ఆయన నన్ను సాగనంపుతూ, "నేను ఊరికి పనిమీద వెళ్లాలండి కాస్త రెండు మూడు రోజులపాటు సుభద్రని కాస్త కంట కని బెడుతూండండి కృతజ్ఞుణ్ణి" అన్నారు.

"నేను నాగదికి వచ్చేశాను. నేనామెకి ఏవిధంగా సాయపడగలను ! — అయినా ఎందుకు నాకీ కుతూహలం ? కాని, ఆవేళ ఆమె నాకు రా సు కు ం టూ కూర్చోటం, చేతిని నొక్కడం జ్ఞాపకాని కొచ్చాయి. 'వద్దు. ఆమెని గురించి తల్చు కోవద్దు.' అని నిశ్చయించుకున్నా చివరికి.

"ఆ రెండో రోజు వాళ్ల బంట్రోతు సుభద్రకి ఒంట్లో బాగులేదనీ నన్ను రమ్మని చెప్పమందనీ చెప్పాడు. నేను వెంటనే దుస్తులు వేసుకుని బయలు దేరాను. ఆమె మంచంమీద పడుకుంది. తలక్రింద ఎత్తుగా రెండు మూడు తలగడా లున్నాయి. తెల్లటి దుప్పటి మెడ దాకా కప్పుకుంది. ఆ గది వాతావరణం అంతా ఒక రోగి గదిలాగ కనిపించింది. కాని ఆమె కళ్లల్లో మాత్రం అదే అల్లరి ! ఈమె రోగికాదు ! ఆమె మెదడులో భావాల్ని గమనించగలిగే కళ్లే నాకుంటే...!

"నేనొక కుర్చీని ఆమె మంచానికి దగ్గరగా లాక్కుని కూర్చున్నాను. ఆమె ఆరోగ్యం గురించి అడిగాను. ఆమె తాను ఒంటరిగా ఉండడం చేత ఏమీ తోచడంలేదనీ, అ ం త క ం టె మరే ప్రమాదస్థితీలేదనీ చెప్పింది, నా చేతుల మీద తన చేతులుంచి, పరవశత్వంలో కళ్ళు మూసుకుంది. ఆ స్పర్శతో నాలో విద్యుచ్ఛక్తి ప్రవహించింది. నేనామె

చేతిని లాక్కుని, నా చేతుల మధ్య ఉంచుకుని ఆమె గాజులతో ఆడు కోడం మొదలెట్టాను. గంటల తరబడి ఆమె నలాగ చూస్తున్నా నాకు తృప్తి కలగలేదు. క్షణంలో ఆమె హృదయంలో తల దాచుకున్నాను. ఆమె చేతులు నా తల మీద పోవడానికి వీల్లేదన్నట్లు ఆపాయి. నేను నా చుట్టుపట్ల ఉండే సమస్తం మరిచి పోయాను. ఎంత సేపలాగున్నానో, కొంత సేపటికి తటాలున తలయెత్తి ఆమె ముఖంకేసి చూశాను. అర్ధనిమీలిత నేత్రాలతో చూస్తోంది, ఎంత అందం !

"అంతా ఒక్క క్షణం నాలో భౌతిక వాంఛ తలయెత్తింది. నేనామె పెదవుల కోసం వెదుకుతున్నాను. వెంటనే ఆమె నన్ను త్రోసి వేసింది. నేనామె ముఖం కేసి చూడలేక పోయాను. నన్ను రేకెత్తించి ఈ విధంగా ఎందుకు మోసం చేయాలి ? ద్రోహి!.... లేక.... నేనామె భావాల్ని తప్పుగా అర్థం చేసుకున్నానా ? లేక నన్నవమానించడానికి పన్నినపన్నాగమాయిది ? లేక తన కెంత మట్టుకు నిగ్రహముందో పరీక్షించుకుందా దీంతో?.... ఛీ.... నాకు శాంతి నిచ్చేందుకు ఎంతో దూరం పరిగెడదామనుకున్నాను. కాని, – నాకెక్కడి శాంతి, దుర్లభ్యం. నేను మరణించేంతవరకూ, భూమిమీద నశించిపోయేవరకూ పరుగులే పెట్టాలా? ఈ పళంగా, నించున్న పళంగా చావనేం ? ఎంత హాయిగా ఉంటుంది అలా చచ్చిపోతే !

"ఆమె నా చేతిని పట్టుకుంది. 'మళ్లా మొదటిలా చెయ్యవూ?' అని అడిగింది. నేను మండిపడి, "ఛస్తే నేను అలా చెయ్యలేను. చెయ్యను" అన్నాను.

"నాలోంచి ఏదో పెదభారం తొలిగి పోయినట్టయింది. నేనామె ముఖంకేసి చూడగలిగాను. ఆమె ముఖం చాలా ప్రశాంతంగా ఉంది. నా రెండు చేతుల్నీ పట్టుకుని, 'నన్ను అపార్థం చేసుకోకు. నువ్వంటే నాకు చాలా ప్రేమ. నాక్కావలిసింది ప్రేమ మాత్రమే. భౌతిక వాంఛలన్నీ నా భర్త తీరుస్తాడు. నువ్వు నన్నలా ప్రేమించలేవూ?' అంది.

"ఆమె నాకళ్లల్లోకి సూటిగా చూస్తోంది దేనికోసమో ! అది నాకళ్లకి కనిపించేది కాదు. స్వప్న సీమల్లో విహరించేవాళ్ల కళ్లకి కనిపించేది మాత్రమే — భౌతిక వాంఛలేని ప్రేమ! — అర్థంలేదు దీనికి. నేనలా ప్రేమించగలనా? — నాకు ఏదీ తేలక, జవాబు చెప్పకుండావెళ్ళిపోయాను.

"ఆమె నన్ను గురించి ఏమనుకుందో నాకు తెలియదు. నాకూ ఆ విషయం అక్కర్లేదు. ఏమంటే, ఆనాటినించీ తిరిగి ఆమెని మళ్లా కలుసుకోలేదు."

కథ పూర్తి చేసి నావంక శూన్యంగా చూశారు శంకరావు గారు "నువ్వేమంటావ్ ? అది సాధ్యమా!" అన్నారు.

నాకు ఏమీ తోచలేదు.

★